
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శనివారం 20 జూలై 2024





లింగన్నపేట-ఏదులబంధం గ్రామాల మధ్య వరదకు తెగిపోయిన రోడ్డు

వర్షపాతం ఇలా...

గడిచిన 24 గంటల్లో వేమనపల్లి మండలంలో 152.3 మిల్లీమీటర్లు, కోటపల్లి మండలంలో 136.6, భీమారం 97.8, జైపూర్ 97.7, కన్నెపల్లి 94.2, చెన్నూరు 93.4, భీమిని 89.6, నస్పూర్ 73.2, బెల్లంపల్లి 68.1, లక్షెట్టిపేట 63.0, మంచిర్యాల జిల్లా కేంద్రంలో 61.8, కాసిపేట 62.1, మందమర్రి మండలంలో 55.3, హాజీపూర్ మండలంలో 50.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



నక్కలపల్లి లొత్‌ఒర్రె నుంచి వాహనాలను దాటిస్తున్న ప్రయాణికులు

పొంగిన వాగులు
స్తంభించిన రవాణా

- జిల్లాలో కురిసిన భారీ వర్షం...
- వరదల్లో మునిగిన రహదారులు
- గ్రామాలకు రాకపోకలు బంద్
- ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మంచిర్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురిసిన వర్షానికి జన జీవనం అతలాకుతలమైంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 74.5 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా భీమిని, కోటపల్లి మండలంలో ప్రధాన రహదారులు తెగిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం నిలిచింది. శ్రీరాంపూర్, మంద మర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి. క్వారీల్లో నీరు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదు. ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ.13 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తితో పాటు, రూ.4 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీత పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

కోటపల్లి: మండలంలో గురువారం రాత్రి సుమారు 3 గంటలపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. లింగన్నపేట ఏదులబంధం గ్రామాల మధ్య రహదారి కోతకు గురైంది. దీంతో పది గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. మరో వైపు నక్కలపల్లి దారిలోని లోత్‌ఒర్రెపై ఉన్న కాజ్‌వే వరదకు కొట్టుకుపోవడంతో రవాణా నిలిచింది. ఉదయం వరద తగ్గడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో వాగుదాటారు. వెల్మపల్లిలో లోతట్టు కాలనీల్లోని ఇండ్లలోకి నీళ్లు చేరాయి. మండల కేంద్రంలో సమ్మక్క అనే మహిళ ఇంటి గోడ కూలింది. పిన్నారంలో పత్తి పంటలు నీట మునిగాయి. గోదావరి, ప్రాణహిత ప్రవాహం పెరిగింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పర్యటించారు. లింగన్నపేట నుంచి ఏదులబంధం గ్రామాల మధ్య తెగిన రోడ్డును పరిశీలించిన ఆయన త్వరగా రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాజారాం- దేవులవాడ గ్రామాల మధ్య బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించి అర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బబ్బెరచిలక జెడ్పీ పాఠశాలలో తాగునీటికి బోరు కావాలని సిబ్బంది కోరడంతో వేస్తామని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెగిన రోడ్ల వద్ద శాశ్వత నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు, అధికారులు ఉన్నారు.

భీమిని: మండలంలో కుండపోత వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లాయి. కమలాపూర్ ప్రాజెక్టు ఎడవ కాలువ తూముకు గండిపడింది. ఖర్జి భీంపూర్ కొత్త చెరువు మత్తడికి గండి పడటంతో ఇసుక సంచులు వేసి గండి పూడ్చే ప్రయత్నం చేసి నా ప్రయోజనం లేకుండాపోయింది. చెరువులు ఖాళీ అవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. వరద ఉధృతికి ఖర్జిభీంపూర్‌లో వాగుపై వంతెన కొట్టుకుపోయింది. వర్షానికి దెబ్బ తిన్న చెరువులు, రోడ్లను డిప్యూటీ తహసీల్దార్ అంజ య్య, ఆర్‌ఐ వెంకటేష్ పరిశీలించారు. పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కమ్మడంతో ఎర్రవాగు, నల్లవాగు పోటెత్తాయి. తిమ్మాపూర్ లోకి నీరు చేరింది. సాలిగామలో 60 ఎకరాల్లో పత్తి చేలు నీట మునిగాయి.

వేమనపల్లి: నీల్వాయి నుంచి కోటపల్లి వెళ్లే రోడ్డుపై నాలుగు భారీ వృక్షాలు పడడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. నీల్వాయి పోలీసులు ఎక్స్‌కావేటర్‌తో తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి. ఎస్ఐ శ్యామ్‌పటేల్ పాల్గొన్నారు.



రాజారాం వద్ద బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



నీల్వాయి-కోటపల్లి రోడ్డుపై పడిన వృక్షాలను తొలగిస్తున్న పోలీసులు

నెన్నెల: మండల కేంద్రంలోని ముద్రకోల సదయ్యకు చెందిన ఇంటి ప్రహారి పిడుగు శబ్దానికి నేల మట్టమైంది. బోరు, సంపు, ధ్వంసమయ్యాయి. రూ.4 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. కోనంపేటలో జయరాం ఇంటి గోడ కూలింది. కుశ్నపల్లిలో కొందరి ఇళ్లలోకి వరద నీరు వచ్చింది. పత్తి చేలల్లో ఇసుక మేటలు వేశాయి.

శ్రీరాంపూర్: ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. గురువారం రెండో షిఫ్ట్ నుంచి ఉత్పత్తి రావడం లేదు. రోజు లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉండగా, మెషీన్లు నిలిచిపోయాయి. రోజు మూడు నుంచి నాలుగు ర్యాకుల బొగ్గు రవాణా చేయాల్సి ఉండగా, ఒక ర్యాకు మాత్రమే పంపుతున్నారు. 16 వేల టన్నుల బొగ్గును సంస్థ నష్టపోయింది.



భీమిని మండలం ఖర్జిభీంపూర్‌లో కొట్టుకుపోయిన వంతెన



కమలాపూర్ ప్రాజెక్టు ఎడమ కాలువ తూముకు గండి పడటంతో వృథాగా పోతున్న నీరు



నెన్నెలలో పిడుగుపాటుకు నేలకూలిన ప్రహరీ

సహకార సంఘాల విస్తరణ ఎప్పుడో..?

- బుట్టదాఖలైన ప్రతిపాదనలు
- కొత్త మండలాల్లో ఏర్పాటుకాని పీఏసీఎస్‌లు
- జిల్లాలో అదనంగా 16 పీఏసీఎస్‌ల ఏర్పాటుకు అవకాశం



జన్నారంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార భవనం

మంచిర్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు వెన్నుదన్నుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) విస్తరణలో జాప్యం జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినా విస్తరణకు నోచుకోలేదు. కనీసం ఉన్నవాటిని కూడా బలోపేతం చేయకపోవడంతో రైతులకు వాటి సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సంఘాల పరిధి ఎక్కువగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తగా ఏర్పాటైన మండ లాల్లో సహకార సంఘాలు లేకపోవడంతో ఆయా మండలాల రైతులు ఇతర మండలాల్లోని సొసైటీలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో ఎక్కువ గ్రామాలు, మరికొన్ని సొసైటీల్లో తక్కువ గ్రామాలున్నాయి. దూరంగా ఉన్న సొసైటీలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనల దశలో నిలిచిన విస్తరణ

రైతులకు సహకార సేవలను మరింతగా పెంచేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సహకార సంఘాల విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. అధికారులు క్షేత్రస్థాయిలో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న సంఘాలకు అదనంగా ఎన్ని అవసరం అవుతాయో అంచనా వేసి ప్రతిపాదనలు తయారుచేసి నివేదికలను ప్రభుత్వానికి పంపారు. సహకార సంఘాల విభజనకు డ్రాఫ్టు నోటిఫికేషన్ జారీ అయింది. అనంతరం ప్రభుత్వ నిర్ణయం మరుగునపడింది. 2020 ఫిబ్రవరి 15న ప్రభుత్వం సహకార ఎన్నికలను నిర్వహించింది.

నూతన సహకార విధానానికి మంగళం

సహకార సంఘాల ఏర్పాటుకు సంబంధించి గతంలో కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ సహకార విధానానికి శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం ప్రతీ గ్రామానికి ప్రాథమిక, మత్స్య, పాల ఉత్పత్తి సహకార సంఘం ఉండాలని నిర్ణయించారు. నూతన విధానాన్ని అనుసరించాలని అప్పటి కేంద్ర మంత్రి సూచనలు చేశారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోవడంతో నూతన విధానానికి మంగళం పాడినట్లయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా సానుకూలంగా స్పందిస్తుందో లేదోననే స్పష్టత రావలసి ఉంది.

విభజిస్తేనే సేవలు విస్తృతం...

రైతులకు వెన్నుదన్నుగా ఉండే సహకార సంఘాల సేవలను విస్తరిస్తేనే మరింతగా ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉండగా, ఏ అవసరం వచ్చినా క్యూ కట్టాల్సి వస్తోంది. సీజన్ ఆరంభంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు బారులు తీరిన సందర్భాలున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా, వాటి పదవీకాలం వచ్చే ఏడాది జనవరితో ముగియనుంది. ప్రభుత్వం స్పందించి సహకార సంఘాలను విస్తరిస్తే జిల్లాలో మరో 16 సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. రైతులకు సహకార సంఘాల సేవలు విస్తరించే అవకాశాలున్నాయి.

మంచిర్యాల డీఎంహెచ్‌వోగా హరీష్‌రాజ్



మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా హరీష్‌రాజ్ నియమితులయ్యారు. జనగాం జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేసిన ఆయన బదిలీపై మంచిర్యాల జిల్లాకు నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, జూలై 19 : 132కేవీ చెన్నూరు లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, కోటపల్లి, భీమారం గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

నస్పూర్, జూలై 19: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో బీడీ కార్మికులకు నాలుగు వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడిచిన అమలు చేయలేదన్నారు. బీడీ కార్మికులకు చేయూత పథకం ద్వారా రూ. 4 వేలు ఆంక్షలు లేకుండా ఇవ్వాలన్నారు. కనీస వేతనం జీవో అమలు చేయాలన్నారు. మార్కెట్లో ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలన్నారు. తాళ్లపల్లి శ్రీనివాస్, జ్యోతి, మంగ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధం

దండేపల్లి, జూలై 19 : గూడెం సాయిబాబా ఆలయంలో శ్రీదత్తసాయి గురుపీఠం సేవట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో గురుపౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం పల్లకిసేవ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చక్రవర్తులపురుషోత్తమచార్యు తెలిపారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19: వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్గత రహదారులు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అంటు వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల పరిధిలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో ఇంటింటికి తిరుగుతూ అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించాలన్నారు. వీధి కుక్కల సమస్యలపై చొరవ తీసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్వారీ జాతరకు సర్వం సిద్ధం
- రేపు ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన దుర్గాదేవి ఆలయం

హాజీపూర్, జూలై 19 : ఎత్తైన కొండలు.. అటవీ ప్రాంతంలో ఉన్న క్వారీ గుట్టలో యేటా ఆషాఢ మాసంలో దుర్గాదేవి జాతరను ఘనంగా నిర్వహిస్తారు. గడ్‌పూర్ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ(ఏసీసీ) క్వారీ దుర్గాదేవి జాతర ఆదివారం జరగనుంది. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గతంలో ఏసీసీ సిమెంట్ కంపెనీకి కావాల్సిన ముడిసరుకు గడ్‌పూర్, ర్యాలీ, చిన్న గోపాల్‌పూర్, నాగారం గుట్టల్లో లభించే రాయితో తయారు చేసేవారు. ఈ క్రమంలో తరుచూ ప్రమాదాలు, ప్రాణనష్టం జరిగేది. కార్మికులు, కంపెనీ యాజమాన్యం మైసమ్మ, దుర్గాదేవి ఆలయాలను నిర్మించి ఆషాడంలో జాతర నిర్వహిస్తారు. జాతరకు మంచిర్యాల జిల్లా నుంచే కాకుండా పెద్దపల్లి, కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు వస్తారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో మంచిర్యాల బస్టాండ్ నుంచి క్వారీ వరకు బస్సు నడపనున్నారు. ప్రైవేటు వాహనాల్లోను భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వస్తారు. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టనున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎన్‌టీఆర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏసీసీ, జూలై 19: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున వరదలు వచ్చే అవకాశం ఉంటుందని, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వరద పరిస్థితులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన కౌంటర్లు, మీ సేవ కేంద్రం, కార్యాలయం ఆవరణను, వాహనాలను కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత గల ప్రతీ దరఖాస్తుదారునికి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున పట్టణంలో పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలని సూచించారు. పట్టణంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రిజిష్టర్‌లు, స్టాకు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. ధరలు, నిల్వల తదితర విషయాలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలని, కొనుగోలు చేసిన సామాగ్రి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్: వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు,మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు పడిపోవడం, రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడం, ఇతరతా సమస్యలపై ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి, మరమ్మతు పనులను పరిశీలించాలన్నారు. మల్టీపర్పస్ కార్మికుల సేవలను వినియోగించుకోవాలన్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండలాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు.

డిమాండ్ల సాధనకు బీసీల పోరుబాట



పోరుబాటలో పాల్గొన్న నాయకులు

మంచిర్యాల అర్బన్, జూలై 19: తమ డిమాం డ్లను పరిష్కరించాలంటూ బీసీ నాయకులు పోరు బాట పట్టారు. శుక్రవారం జాతీయ బీసీ హక్కుల సమితి ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా నుంచి లక్షెట్టిపేట వరకు పాదయాత్ర నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలాగా బీసీల సామాజిక రక్షణ భద్రతకు బీసీ యాక్టు ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచి ఏ,బీ,సీ,డీ గ్రూప్‌లుగా వర్గీకరించాలని, కేంద్ర ప్రభుత్వం జనగణనలో భాగంగా బీసీలకు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో రూ.2లక్షల కోట్లు, రాష్ట్రంలో రూ.1లక్ష కోట్ల బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు కర్రె లచ్చన్న, శ్రీపతి రాములు, చంద్రగిరి చంద్రమౌళి, బండ సతీష్, పంపరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు మడేలయ్య బోనాల జాతర

మంచిర్యాల అర్బన్, జూలై 19 : హమాలీవాడ మడేలేశ్వర స్వామి దేవాలయంలో శనివారం బోనాల జాతర జరుగుతుందని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోశంలు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో మాట్లాడారు. పోశం, ధర్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

పోస్టర్ తయారీ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో యాదయ్య

ఏసీసీ, జూలై 19: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ సాధికారత, ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా మహిళల స్వావలంబన అనే అంశాల మీద జిల్లా సైన్స్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీల్లో విజేతలైన విద్యార్థులను డీఈవో యాదయ్య అభినందించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి రకరకాల పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో జీవన్‌తేజ ప్రథమ, అక్షర ద్వితీయ, దివ్య తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నగదు పారితోషికంతోపాటు ప్రశంస పత్రాలను డీఈవో అందించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మూర్తి, యాదగిరిలు వ్యవహరించారు. కోఆర్డినేటర్లు చౌదరి, సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో జాడి పోచయ్య పాల్గొన్నారు.

బ్యాంకులకు తరలిన రైతులు



తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద రుణమాఫీకి వచ్చిన అన్నదాతలు

దండేపల్లి, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయడంతో రైతులు ఆయా బ్యాంకులకు పరుగులు తీశారు. తమకు రుణమాఫీ అయ్యిందా లేదా అని తెలుసుకునేందుకు బ్యాంకుల వద్దకు వెళ్లారు. గురువారం రైతుల ఖాతాలో జమచేయగా శుక్రవారం ముత్యంపేట, దండేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు, మ్యాదరిపేటలో యునియాన్ బ్యాంకు, తాళ్ళపేటలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద రైతులు బారులు తీరి రుణమాఫీపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఆశా వర్కర్ల నిరసన

ఆసిఫాబాద్, జూలై 19: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశా వర్కర్లు రాజేందర్, లక్ష్మి, భారతిదేవి, పద్మ, పార్వతి, రూప తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

మీ సేవ కేంద్రాలు దివ్యాంగులకు కేటాయించాలి

నస్పూర్, జూలై 19 : జిల్లాలో త్వరలో ఇవ్వనున్న మీ సేవ కేంద్రాలను దివ్యాంగులకు కేటాయించాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్యకు శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా నాయకులు అప్పారావు, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వామ్యం కావాలి

పెంచికలపేట, జూలై 19: వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మండల ప్రత్యేకాధి కారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్కపల్లిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'జన్మంతా మోసే నేల తల్లి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము, ఒక చిన్న మొక్కని నాటి నేలతల్లి ఆయుష్షని కాపాడి కొంచమైనా రుణం తీర్చుకుందాం' అని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో ఆల్బర్ట్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, సెక్షన్ ఆఫీసర్ జగన్మోహన్‌గౌడ్, అటవీ, పంచాయతీరాజ్, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు దొంగిలించిన వ్యక్తుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మంచిర్యాల అర్బన్, జూలై 19: పాత మంచిర్యాలలోని ఐస్ ఫ్యాక్టరీలో విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఫ్యాక్టరీకి తాళం వేసి ఉండగా హమాలీవాడకు చెందిన కలకట్ల ఖాజా, మహ్మద్ అబ్బాస్, కలకట్ల శివలు తాళం పగలగొట్టి 500 మీటర్ల కేబుల్ వైర్, 6 విద్యుత్ మోటార్లు, 2 మెర్సిబుల్ పైపులు దొంగిలించినట్లు, వాటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఫ్యాక్టరీ యజమాని రాజనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, శుక్రవారం ఐబీ చౌరస్తాలో ఎస్సై సురేష్‌తో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగిలించిన సొత్తును అమ్మేందుకు ఆటోలో తీసుకువెళ్తూ పట్టుబడ్డారని సీఐ పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు.

భారీకేడ్స్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


కుబేర్ (ఫైల్)

చెన్నూరు, జూలై 19: జాతీయ రహదారి 63 గోదావరి రోడ్డు వద్ద శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన దుర్గం కుబేర్ (25) అనే యువకుడు చెన్నూరు పట్టణానికి వచ్చి స్వగ్రామంకు బైక్‌పై వెళ్తూ పోలీసులు ఏర్పాటు చేసిన సూచికల బోర్డును వేగంగా ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్వేత సంఘటన స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, జూలై 19: ఎమ్మెల్సీ దండెవిఠల్ ముఖ్యఅనుచరుడు మండల కేంద్రానికి చెందిన సామల రాజన్న మాతృమూర్తి లక్ష్మి మృతిచెందడంతో శుక్రవారం పెద్దకర్మ సందర్భంగా రాజన్నకుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించారు. ఆయనవెంట మాజీసర్పంచ్ అన్వర్‌హుస్సేన్, రమేష్, సురేష్‌గౌడ్, శేఖర్, రాజేష్ అశోక్, శ్రవణ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెన్నెల, జూలై 19: ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పోలంపల్లి మల్లేష్ (28) అనే యువకుడు మద్యం మత్తులో రెండు రోజుల కిందట గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మద్యానికి బానిసైన మల్లేష్ భార్య, తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ నెల 17న గొళ్లపల్లి శివారులో గడ్డిమందు తాగానని, తనను బతికించాలని భార్యకు ఫోన్‌చేసి చెప్పాడు. అతడిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానాలో చేర్చారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కాసిపేట, జూలై 19: మండలంలోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ముత్యంపల్లికి చెందిన ఎగ్గె రాములు వద్ద 2 లీటర్లు, కాసిపేటకు చెందిన ముడిమడుగుల ఈశ్వరి వద్ద 2 లీటర్ల నాటుసారా లభించిందని సీఐ సమ్మయ్య తెలిపారు. గుడుంబా తయారుచేసినా, రవాణా చేసిన చర్యలు ఉంటాయన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ శారద తెలిపారు. సునీల్, సాగర్, కవిత పాల్గొన్నారు.

బ్రాందీషాపులో దొంగతనం

శ్రీరాంపూర్, జూలై 19 : శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని హరిహర వైన్స్‌లో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. పైన ఉన్న రేకును పగులగొట్టిన దొంగ లోనికి దిగాడు. 10 వేల రూపాయల నగదు, మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు.

ఇన్‌స్పైర్ నామినేషన్‌లపై అవగాహన

ఏసీసీ, జూలై 19: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, వెల్ఫేర్, లోకల్‌బాడీ ప్రధానోపాధ్యాయులకు, సైన్స్ ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులపై డీఈవో యాదయ్య జూమ్ ద్వారా శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలకు ఇన్‌స్పైర్ మనక్ వేదికగా నిలుస్తుందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి నామినేషన్‌లు ప్రారంభమయ్యాయని, ప్రతీ పాఠశాల నుంచి తప్పకుండా ఐదు నామినేషన్‌లు ఆగస్టు 30లోగా పంపించాలన్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థికి రూ.10 వేల నగదు అందుతుందని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జూలై 19: పట్టణంలోని వడ్డెజోన్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జి లింగయ్య వారం రోజులక్రితం గుండె పోటుతో మృతిచెందగా శుక్రవారం రాత్రి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. అదే కాలనీకి చెందిన తిరుపతి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబీకులను పరామర్శించారు.

గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు



నిందితులతో మాట్లాడుతున్న డీసీపీ

మంచిర్యాల అర్బన్, జూలై 19: జిల్లాలో గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకొంటామని డీసీపీ భాస్కర్ అన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకం కేసుల్లో ఉన్న వారికి శుక్రవారం కార్యాలయ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గంజాయి కేసుల్లో ఉన్న నేరస్తులపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. నేర ప్రవృత్తిని మార్చుకోకుండా మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని, ఈ యాక్టు కింద కేసు నమోదైతే రెండేళ్ళు శిక్ష పడుతుందని హెచ్చరించారు. గంజాయికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 8712671111, టోల్‌ఫ్రీ 14446కు కాల్ చేయాలన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన నలుగురికి కౌన్సెలింగ్

గంజాయి సేవిస్తూ పట్టుబడిన నలుగురికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మందమర్రికి చెందిన వారిలో ఇద్దరు ఐటీఐ చదివి సింగరేణి ఉద్యోగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని, మరో ఇద్దరు పేయింటింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స నిమిత్తం చేర్పామన్నారు. ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

హాజీపూర్, జూలై 19: ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని ఎస్ఐ సురేష్ అన్నారు. గురువారం రాత్రి పడ్తన్‌పల్లి గ్రామ పంచాయతీలోని రాంపూర్‌లో పల్లెనిద్ర చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



చెన్నూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌లు

దండేపల్లి, జూలై 19: ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌లు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ కులస్తులకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కాలంటే బీసీ-డీ నుంచి బీసి-ఏ జాబితాలో చేర్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యేటా వెయ్యి కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50ఏళ్లు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పింఛన్‌లను మంజూరు చేయాలన్నారు. మేకల తిరుపతి, గంగమల్లు, మేకల రమేష్, కిషన్, సత్తన్న, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

చెన్నూరు: ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జున్‌కు ముదిరాజ్ కులస్తులు వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచు కృష్ణ, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

కాసిపేట, జూలై 19: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని టీజీపీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల బదిలీ అయిన రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, 317 జీవోలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. పదోన్నతుల్లో మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ వెకెన్సీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.


సభ్యత్వ నమోదు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ముత్యంపల్లి, లంబాడితండా, ధర్మారావుపేట, దేవాపూర్ పాఠశాలలతోపాటు తెలంగాణ మోడల్ స్కూల్, పెద్దనపల్లి, కోనూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్షుడు రమణా రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జీ సాంబమూర్తి, జ్యోతి, శ్రీనివాస్, కృష్ణగోపాల్ పాల్గొన్నారు.

జైపూర్: పౌనూరు ప్రభుత్వ పాఠశాలలో పీఆర్ టీయూటీఎస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. మండల ఇన్‌చార్జీ రవి, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ, రాజన్న, మల్లేష్, సంధ్యారాణి, వివేక పాల్గొన్నారు.

బడి ఇలా.. చదువుకునేదెలా...


తరగతి గదుల ఆవరణలో ఉన్న పేడ, నిలిచిన వర్షం నీరు

బెల్లంపల్లి(తాండూర్), జూలై 19: మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాల పశువుల పాకగా మారింది. ఈ పాఠశాలకు గేటు లేకపోవడంతో సెలవు రోజులు, పాఠశాల ముగిసిన అనంతరం పశువులు తరగతి గదుల్లోకి వెళ్తున్నాయి. తరగతి గదుల ఆవరణలో పేడ, మూత్రంతో అపరిశుభ్రంగా మారుతోంది. శుక్రవారం ఉదయం విద్యార్థులు పాఠశాలకు రాగా పేడ, చెత్తా, చెదారంతో దుర్వాసన వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు పాఠశాల ఆవరణలో నిలుస్తుంది. దీంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకుని పాఠశాలకు గేటు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు , విద్యార్థులు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మందమర్రిరూరల్, జూలై 19 : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మంద తిరుమల్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఆకారం రమేష్‌లు కలిశారు. ఎంపీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బండి శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి టౌన్, జూలై 19: రైతులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు రైతుల డబ్బులను కాజేసే అవకాశం ఉందన్నారు. ఏదో ఒక బ్యాంకు పేరిట వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకు లోగోతో ఏపీకే ఫైల్స్ పంపిస్తారని, దీని లింక్ క్లిక్ చేస్తే వారికి సమాచారం వెళ్తుందని, దీని ద్వారా డబ్బులు కాజేస్తారని తెలిపారు. డబ్బులు సైబర్‌నేరాల పాలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

ఏసీసీ, జూలై 19 : పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు అరికోల సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం కింద మృతుడి కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును శుక్రవారం బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ మృతుడి భార్య అరికోల భాగ్యలక్ష్మీకి అందజేశారు. బ్యాంకు సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీతో నడిచే సైకిల్

- గ్రామీణ ప్రాంత యువకుడి ఆవిష్కరణ


బ్యాటరీతో తయారు చేసిన సైకిల్‌తో మల్లేష్

దండేపల్లి,జూలై 19: పెట్రోల్‌తో నడిచే బైక్‌ను చూశాం... ఎలక్ట్రిక్ బైక్‌ను చూశాం... కాని సైకిల్‌నే బైక్‌లా మార్చేశాడు దండేపల్లి మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన యువకుడు. 5వ తరగతి వరకే చదివిన అతడు నూతన పరికరాలను ఆవిష్కరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు సాంబారి మల్లేష్. మల్లేష్ గతంలో ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పనిచేశాడు. ఆ సమయంలో పలు ఆవిష్కరణలు చేశాడు. రైతులు పొలాల వద్దకు వెళ్లకుండానే సెల్‌ఫోన్‌తో వ్యవసాయ మోటారు ఆన్ ఆఫ్ చేసే పరికరాన్ని, చప్పట్లు కొడితే లైట్ వెలిగేలా తయారు చేశాడు. ఎలక్ట్రానిక్ పరికరాలపై అతనికి ఉన్న మక్కువ అతనిని కొత్త కొత్త ఆవిష్కరణాల వైపు వెళ్లేలా చేస్తుంది. పెట్రోల్ ధరలు నేపథ్యంలో బ్యాటరీతో నడిచేలా సైకిల్ ఆవిష్కరించాడు.

బ్యాటరీతో నడిచే సైకిల్ ఆవిష్కరణ..

ఉపాధి లేక కొన్నేండ్లు దుబాయ్ వెళ్లాడు.. ఇటీవలే వచ్చిన మల్లేష్ మళ్లీ ఆవిష్కరణల వైపు దృష్టి సారించాడు. ఓ సైకిల్ కొనుగోలు చేసి దానికి బ్యాటరీతో నడిచేలా తయారు చేశాడు. రూ.5 వేలకు కొత్త సైకిల్‌ను కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లో బ్యాటరీతోపాటుమోటార్ కిట్ మొత్తం రూ.15వేలకు కొనుగోలు చేసి సైకిల్‌కు బిగించారు. బ్యాటరీ కేవలం 2 గంటలు చార్జింగ్ పెడితే 35 కిలో మీటర్ల దూరం ప్రయాణించవచ్చు. పైగా సైకిల్ స్పీడ్ గంటకు 35 కిలోమీటర్ల ఉంటుందన్నారు. పెట్రోల్ ఖర్చు లేకుండా బ్యాటరీతో నడిచే ఇలాంటి సైకిల్ అవసరమున్న వారు తెలియజేస్తే ఆర్డర్‌పై తయారు చేసి ఇస్తా అంటున్నాడు మల్లేష్. అనుకోకుండా బ్యాటరీ చార్జింగ్ అయిపోతే మళ్లీ సైకిల్‌లా తొక్కుతూ వెళ్లవచ్చని పేర్కొన్నాడు. ప్రభుత్వం సహకారం అందిస్తే ఇంకా సరికొత్త ఆవిష్కరణలు తీసుకొస్తానని పేర్కొంటున్నాడు మల్లేష్.


సైకిల్ ముందు ఏర్పాటు చేసిన బ్యాటరీ, సైకిల్ ఫ్రీవీల్ వద్ద అమర్చిన మోటారు

వాగు వద్ద తల్లిదండ్రుల ఆందోళన

కాసిపేట, జూలై 19: ధర్మారావుపేట వాగు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి సిడాం జంగుబాయి మాట్లాడుతూ మల్కేపల్లి నుంచి ధర్మారావుపేట పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు వాగు దాటాల్సి ఉంటుందని, దీంతో తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. వర్షాలు కురిసినప్పుడు వాగు ఉప్పొంగితే పాఠశాలకు వెళ్లడం లేదన్నారు. గతంలో వాగు దాటుతున్నప్పుడు విద్యార్థులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయన్నారు. వాగు దాటేందుకు రహదారి సౌకర్యం కూడా లేదని, చెట్లు,ముళ్ల పొదల మధ్య నుంచి వెళ్లాల్సి వస్తుందన్నారు. రోజు తల్లిదండ్రులు వాగు దాటించి పాఠశాల వద్ద దింపుతున్నారన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించి రహదారి సౌకర్యం మెరుగుపర్చాలన్నారు. రాజేష్, నీల, శ్రీనివాస్, సాయికుమార్, లక్ష్మీ, శంకర్ పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి



ఏసీసీ, జూలై 19: యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన మిట్టపల్లి తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో తిరుపతిని ఎన్నుకున్నారు. తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతిలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 19: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. శుక్రవారం తాండూర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పలు గ్రామాల్లో డ్రైనేజీలు, వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షం నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు 10వ తరగతికే పరిమితం అవుతున్నారన్నారు. మండల అధ్యక్షుడు భరత్‌కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు చిరంజీవి, తుకారాం, ఏమిర్ల ప్రవీణ్, దుర్గచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

మందమర్రిరూరల్, జూలై 19: ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న కూలీలకు నెల రోజులుగా వేతనాలు రావడం లేదని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కూడా ప్రతి నెల 5వ తేదీన పడే వేతనాలు ఇప్పటికీ రాలేదని దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగసత్యనారాయణ


పిల్ల ప్రతినిధులను కలిసేందుకు వస్తున్న కార్మిక కుటుంబాల సభ్యులు

కాగజ్‌నగర్ , జూలై 19: ఎస్పీఎం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎస్పీఎం ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో కార్మికుల ఇండ్లలోకి వరద నీరు వచ్చిందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఎస్పీఎం కార్మిక కుటుంబాలను ఇతరచోట్ల మార్చాలన్నారు. వరద నీటికి నిత్యవసర సరుకులు పూర్తిగా కొట్టుకపోయాయన్నారు. కార్మికులను వెంటనే ఆదుకొని నెలకు సరిపడా సరుకులివ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్పీఎం ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యక్రమ కోఆర్డినేటర్ గోలెం వెంకటేష్, కార్మికులు, కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతో గ్రామ పంచాయతీలకు గ్రహణం


మాట్లాడుతున్న కేసరి అంజనేయులు గౌడ్

రెబ్బెన, జూలై 19: కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీలకు గ్రహణం పట్టిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కుప్పకూలినట్టు పేర్కొన్నారు. సర్పంచిల పదవీ కాలం ముగిసి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎన్నికలు నిర్వహించ లేదన్నారు. జీపీలకు నిధులు లేక పాలన కుంటుపడిందన్నారు. ఒకవైపు నిధులు లేక అభివృద్ధి కుంటు పడుతున్నట్టు వివరించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఎన్నికలు వెంటనే నిర్వహించేట్టు చూడాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ, మండల ప్రధానకార్యదర్శి నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చేపలు పడుతూ..ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిరసన


గుంతలో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న డ్రైవర్ రాజేష్

బెజ్జూరు, జూలై 19: అది కేవలం 15 కిలో మీటర్ల దూరం. అడుగ డుగునా గుంత, గుంత లో నిలిచిఉన్న వరద నీరు.. ఆపాటి దూరా నికే గంటకుపైగా సమ యం పడుతోంది మొ ర్రో అంటూ గుంతలో చేపలు పడుతూ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరు నిరసన వ్యక్తం చేశాడు. బెజ్జూరు నుంచి పెంచికలపేట మీదుగా ఆసిఫాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ రాజేష్ ఈమార్గం గుండా బస్సు నడపడం కష్టంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. సలుగుపల్లి నుంచి పెంచికలపేట వరకు కేవలం 15కిలోమీటర్ల దూరం ఉన్నా ప్రయాణం కష్టతరంగా ఉందని పేర్కొన్నాడు. ఇది కేవలం బస్సు డ్రైవర్‌గా తన ఆవేదన మాత్రమే కాదని ఈమార్గం గుండా వెళ్లే ప్రతివాహనదారుడు పరిస్థితి ఇదేనని అన్నాడు. దశాబ్దాల క్రితం వేసిన బీటీరోడ్డు పూర్తిగా చెడిపోయి అడుగుకోగుంత తయారై గుంతలో వరదనీరు ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నాడు.

మహిళా శక్తి పథకంలో పాడి పరిశ్రమకు అవకాశం

ఆసిఫాబాద్, జూలై 19: మహిళా శక్తి పథకంలో పాడి పరిశ్రమకు అవకాశం కల్పించామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్,రెబ్బెన,వాంకిడి,కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాలకు చెందిన డెయిరీలబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విజయడెయిరీ డైరెక్టర్ మధుసూదన్, పశువైద్యులు డాక్టర్‌మురళీ, స్త్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మహిళాశక్తి పథకంలో భాగంగా డెయిరీఫార్మ్‌కు పాడిపశువులను ఇతర రాష్ట్రం నుంచి కొనుగోలుచేసి ఇస్తామన్నారు. పాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని, ఆసిఫాబాద్ మండలంలో పాడిపశువుల నుంచి వచ్చిన కొన్ని లీటర్లపాలు విజయడెయిరీకి ఇవ్వవచ్చన్నారు. 15 రోజుల్లో సంబంధిత సభ్యుల ఖాతాకు డబ్బులు జమ చేస్తారని తెలిపారు. పశువులకు బీమాచేయిస్తే మరింత లాభం చేకూరే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఏపీఎంలు శ్రీనివాస్,రాజ్‌కుమార్, మహిళాశక్తి ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ అంశాల అభివృద్ధిపై దృష్టిసారించాలి

నీతిఆయోగ్‌లోని సంపూర్ణత అభియాన్ కార్యక్రమం పరిధిలో గల అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంపూర్ణఅభియాన్ కార్యక్రమంలో తిర్యాణి బ్లాక్‌పరిధిలో విద్యవైద్యం, వ్యవసాయం, ఆరోగ్యం, శిశుసంక్షేమం, రహదారుల అభివృద్ధి పలుఅంశాలపై సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మారుమూల గ్రామాలకు సైతం వైద్యసేవలు అందించే విధంగా కార్యచరణ రూపొందించుకొని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణీ, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లలకు సమయానుసారంగా పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. వర్షాకాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో బాగంగా రైతులకు పంటసాగుపై అవసరమైన మెళకువలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహిళా సంఘాల బలోపేతం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాంభట్, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, నీతి ఆయోగ్ జిల్లా సమన్వయకర్త మణివేలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి: ఎస్పీ

ఆసిఫాబాద్ రూరల్, జూలై 19: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో ఏఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి విలేకరులసమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, జైనూరు ప్రాంతాల్లో ట్రాఫిక్‌నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పోలీసు యాక్టు 30 అమలుకు సంబంధించి ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ర్యాలీలు, ధర్నాలు చేస్తే తమకు ముందస్తు సమాచారం అందించడమే ఈ యాక్ట్ ఉద్దేశమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రజలు తమకు సహకరించాలని కోరారు. నేరాలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు మీడియాకు తెలిపేలాచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్: జిల్లాలోని ఈసుగాం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.దయానంద్ గత సంవత్సరం డిసెంబర్‌లో గుండెపోటుతో మృతిచెందడంతో అతని కుటుంబానికి రూ.8లక్షల చెక్కును శుక్రవారం ఎస్పీ శ్రీనివాసరావు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మరణించిన పోలీసు కుటుంబాలకు పోలీసు శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. అదే విధంగా కుటుంబంలో అర్హత గల వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీసు కార్యాలయ ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అజయ్ వర్మ, దయానంద్ భార్య విజయ, కుమారులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మహిళాశక్తి క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 19: మహిళలకు చేయూతనందించే దిశగా ప్రభుత్వం మహిళాశక్తి పథకం ప్రారంభించిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో మహిళాశక్తి పథకంకింద ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తవారి, జిల్లా వైద్యాధికారి తుకారాంతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం మహిళాశక్తి పథకం ద్వారా చేయూతనందిస్తోందన్నారు. క్యాంటీన్ త్వరగా ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజనసంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్‌లు, సరుకుల నిలువలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల పఠనసామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు తాజా కూరగాయలతో ఆహారం అందించాలని, వారిఆరోగ్యంపట్ల నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లాగిరిజన సంక్షేమాధికారి రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్ చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ పోస్టర్ల ఆవిష్కరణ

పదవతరగతి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ తరగతులకు సంబంధించిన మాస్టర్ మైండ్స్ పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్‌మైండ్స్ గూగుల్ మీట్ ఆన్‌లైన్ క్లాసులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, మాస్టర్ మైండ్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికట్టాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కౌటాల, జూలై 19:మండలంలోని గుండాయిపేటలో ప్రజాలైఫ్‌కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచితవైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగ్యూ, చికున్‌గున్య, మలేరియా వ్యాధులనుంచి మనల్నిమనం కాపాడుకోవాలంటే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గురువారం విద్యార్థినులు ఆషాడమాసం సందర్భంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కల్లూరి వైష్ణవి గోరింటాకు విశిష్టతను తెలిపారు.

-ఆసిఫాబాద్ మండల ఏబీవీపీ కార్యవర్గంను విభాగ్‌కన్వీనర్ అజయ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నగరకార్యదర్శిగా హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా కైఫ్,సాయినాథ్, వైభవ్,సిద్దార్థ,నవీన్, సంయుక్తకార్యదర్శులుగా ఫర్హ, రంజిత్, శశాంక్, రాజు,హాస్టల్స్ ఇన్‌చార్జిగా జమీన్, మీడియాఇన్‌చార్జిగా సుదీర్, కార్యవర్గసభ్యు లుగాసచిన్,మల్లేష్,ఈశ్వర్,అకాష్,లక్ష్మనరసింహాను నియమించారు.

ఆసిఫాబాద్: వేసవిలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జితసెలవులు మంజూరుచేయాలని టీఎస్‌యూటీఎఫ్‌నాయకులు శుక్రవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

వాంకిడి: అమ్మఒడి ఆదర్శపాఠశాలలో నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.సమావేశంలో నాయకులు కార్తీక్, విలాస్, శంకర్, హనుమంతుపాల్గొన్నారు.

కెరమెరి: విద్యారంగసమస్యలు పరిష్కరించాలని ఎస్ ఎఫ్ఐ కార్యదర్శి కిరణ్ అన్నారు. ఆశ్రమపాఠశాలలు, వసతిగృహాల్లో కనీసవసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

-మండలకేంద్రంతోపాటు గ్రామపంచాయతీల్లో శుక్రవారం డ్రైడేకార్యక్రమాలు నిర్వహించారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని మండలవ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు.

జైనూర్: మండలకేంద్రంలోని అంజనేయస్వామి మం దిరంలో శుక్రవారం జైనూర్,సిర్పూర్(యు),లింగాపూర్ మండలాలకు చెందిన విశ్వహిందూ పరిషత్‌కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జైనూరు కాసుపటేల్‌గూడకు చెందిన చాందేకర్ ఆత్రంభీంరావ్, ఉపాధ్యక్షుడుగా పంచవటి జువెలర్స్ ప్రభాకర్, అదేవిధంగా సత్సంగ్ ప్రతినిధిగా ధడెకర్ శివానంద్‌ను ఎన్నుకున్నారు.

లింగాపూర్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైనవిద్యను అందించాలని ఎస్సార్పీ కనకబుచ్చిరాంఅన్నారు. శుక్రవారం మండలంలోని రావునూర్ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు.

చింతలమానేపల్లి: మహిళలుఆర్థికంగా ఎదిగేందుకు మండలసమాఖ్య ఉద్యోగులు పాటుపడాలని రవీంద్రనగర్ బ్రాంచి మేనేజర్ కిరణ్ అన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

పెంచికలపేట:మండలంలోని గుండెపల్లిగ్రామంలో, కమ్మర్‌గాం ఆశ్రమపాఠశాలలో శుక్రవారం పీహెచ్‌సీఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 96మందిని పరిశీలించి చికిత్స అందజేశారు.

ఒక్కో రైతుకు ఏడు బస్తాల ఎరువుల పంపిణీ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిర్పూర్(టి), జూలై 19: మండలంలో ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలపై ఇటీవల 'ఆంధ్ర జ్యోతి' జిల్లా అనుబంధంలో 'ఎరువుల కోసం రైతుల పడిగాపులు' అన్నశీర్షికన కథనం ప్రచురితం కావడంతో వ్యవసాయాధికారులు స్పందించారు. శుక్రవారం వ్యవసాయాధికారులు ఒకేసారి అయిదు లారీల యూరియా బస్తాలను తెప్పించి ఒక్కో రైతుకు ఏడు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. ఇంకా అవసరం ఉన్న రైతులకు ఎరువులను పంపిణీ చేస్తామని సీఈవో రాకేష్ పేర్కొన్నారు.

అండర్ బ్రిడ్జితో అగచాట్లు

- చిన్నపాటి వర్షానికే నిండిపోతున్న అండర్‌బ్రిడ్జిలు
- రాకపోకలకు తాత్కాలిక గేటు మూసివేత
- అత్యసవరమొస్తే దేవుడిపైనే భారం
- వంజీరి, శివాపూర్ గ్రామప్రజల అవస్థలు వర్ణనాతీతం



వంజీరి అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచి వర్షం నీరు

కాగజ్‌నగర్, జూలై 19: కేంద్ర ప్రభుత్వం రైల్వే ట్రాక్ అనుసంధానంగా ఉండే గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో రూ.1కోటితో మహారాష్ట్ర-తెలంగాణలో పలుచోట్ల అండర్‌బ్రిడ్జిల నిర్మాణం చేపట్టింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వంజీరి, శివాపూర్ గ్రామాల పొలిమేరల్లో అండర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని గత ఏడాది ప్రారంభించి పూర్తిచేశారు. కాగజ్‌నగర్ మండలం వంజీరి సమీపంలో అండర్‌బ్రిడ్జి పూర్తి కావటంతో తాత్కాలిక గేటును పూర్తిగా మూసివేశారు. ఆరు నెలల నుంచి కూడా అండర్ బ్రిడ్జి ద్వారానే నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో అండర్ బ్రిడ్జి పూర్తిగా వర్షం నీరుతో నిండిపోయింది. ఒకవైపు తాత్కాలిక గేటు మూసివేయటం, మరోవైపు అండర్‌బ్రిడ్జి పూర్తిగా వర్షం నీటితో నిండిపోవటంతో ప్రజలు పట్టాలు దాటలేని పరిస్థితి ఏర్పడింది. వర్షం నీరు పోవడానికి ఈ అండర్ బ్రిడ్జికి చిన్నపాటి రంధ్రం చేశారు. దీనిద్వారానే నీరు వెళ్లాల్సి ఉంది. అయితే వర్షం అధికంగా ఉంది. నడుము లోతు నీరు ఉండడంతో గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఒకవైపు చదువుకునే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి. పై నుంచి వెళదామంటే గేటు వేశారు. చేసేది లేక అత్యసరమున్న వారు పట్టాలుదాటి కాగజ్‌నగర్‌కు వస్తున్నారు. అదేవిధంగా శివపూర్ వద్ద ఏర్పాటు చేసిన అండర్‌బ్రిడ్జి వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం గ్రామాలకు రాకపోకలు లేకపోవటంతో నిస్సహాయస్థితిలో వంజీరితోపాటు ఆయాగ్రామాల ప్రజలు వేచిచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయ కులు వెంటనే స్పందించి వర్షాకాలంలో ఏర్పడే సమస్యకు శాశ్వత పరిష్కార పరిష్కారం చూపించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేత..

వంజీరి అండర్‌బ్రిడ్జి సమస్యను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం రైల్వే స్టేషన్ మాస్టర్‌కు బీఆర్ఎస్‌నాయకులు వినతిపత్రం అందజేశారు. సిర్పూరు నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ వర్షాలకు అండర్‌బ్రిడ్జి పూర్తిగా నిండిపోవడంతో ప్రస్తుతం వంజీరి ప్రజలు బయటకు వచ్చేందుకు దారి లేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దాసరి నరేందర్, మాజీఎంపీటీసీ బాబాజీ, రావూజీ, దాసరి నరేందర్ తదితరులున్నారు.



● మహిళల పరిస్థితి దారుణం..
-విజయ, వంజీరి

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అండర్ బ్రిడ్జిలో నీరు నిండిపోయింది. తాత్కాలిక గేటు మూసివేశారు. కేవలం ఈ బ్రిడ్జి ద్వారానే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి ఉంది. నడుము లోతు నీళ్లనుంచి మహిళలు ఎలా వెళ్లగలరు. చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు, నాయకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.



● రాకపోకలు నిలిచిపోయాయి..
-వెంకటేష్, వంజీరి

వంజీరి గ్రామానికి వెళ్లాలంటే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామానికి వెంటనే రాకపోకలు పునరుద్ధరించాలి. రవాణా వ్యవస్థస్తంభించిపోగా పడరానిపాట్లు పడుతున్నాం.



● చాలా కష్టంగా ఉంది..-రాజేశ్వర్, శివపూర్

తమ గ్రామానికి అండర్ బ్రిడ్జి నిర్మించటం సంతోషమైనప్పటికీ చిన్నపాటి వర్షానికే అది నీటితో నిండిపోతోంది. భారీ వర్షాలు కురిస్తే చాలా కష్టం. నీరు వెళ్లిన తర్వాతనే రాకపోకలు చేయాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేట్లు చూస్తే బాగుంటుంది.



దహెగాంలో మత్తడి పారుతున్న పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టు



బెజ్జూరులో మత్తడి పోతున్న గొల్లబాయి చెరువు

భారీ వర్షం..

జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 66.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవ హించాయి. కాగజ్‌నగర్ పట్టణంతోపాటు మండలంలో కురిసిన వర్షానికి మూడు పెంకుటిండ్లు కూలిపోయాయి. ఇండ్లలోకి వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- ఉప్పొంగిన వాగులు
- కూలిన నాలుగు ఇండ్లు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- పలుచోట్ల తెగిపోయిన రోడ్లు
- మునిగిన పంట చేలు

కాగజ్‌నగర్, జూలై 19: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 11.50 గంటలకు ప్రారంభమైన వర్షం రెండుగంటల పాటు ఏకధాటిగా కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సంజీవయ్యకాలనీ, మార్కెట్‌లోని పలు కాలనీల్లో ఇండ్లలోకి వర్షం నీరు వచ్చి చేరింది. రాత్రి పూట ఏం చేయాలో అర్థంకాక అంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ఒకవైపు వర్షం, మరోవైపు కరెంటు సరఫరాకు అంతరాయంతో బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సంజీవయ్యకాలనీతోపాటు పరిసర కాలనీల్లోకి ఒక్కసారి వరదనీరు అధికంగా వచ్చింది. పట్టణంలోని వివిధ కాలనీల్లో మూడిళ్లు కూలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. బయట ఉన్న బైక్‌లు వరదనీటిలో మునిగిపోయాయి. అలాగే కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ రిజర్వాయర్‌కు గండిపడింది. ఈ రిజర్వాయర్‌లో ఉన్ననీరంతా బయటికిపోయి సమీపపెద్దవాగులో కలిసిపోయింది. రిజర్వాయర్‌లో పెంచుతున్న చేపలు కొట్టుకుపోయాయని పెంపకందారులు పేర్కొన్నారు. తమకు పరిహారం ఇప్పించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉదయం పూటలో తట్టు ప్రాంతాలవాసులకు స్థానిక వ్యాపారి జక్కుసురేష్ అల్పాహారం అందించారు. పట్టణం, మండలంలో జరిగిన వరదనష్టంపై అంచనా వేసేందుకు తహసీల్దార్ కిరణ్ కుమార్, ఆర్ఐ ఖలీక్ ఆధ్వర్యంలో సర్వే చేశారు.

బెజ్జూరు/చింతలమానేపల్లి/ దహెగాం/ పెంచికలపేట/ సిర్పూర్(టి): మండలంలోని లోలెవల్ వంతెనలు ఉప్పొంగి పోయాయి. సోమిని, కుశ్నపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి భారీగా వర దనీరు పొంగిపొర్లడంతో పదిగ్రామాల కు రాకపోకలు స్తంభించాయి. ఉపా ధ్యాయులు వాగువద్ద ప్రవాహం తగ్గేవరకు ఎదురు చూశారు. వాగు అవతలఉన్న సుస్మీర్, సోమిని, ఇప్పలగూడ, మొగవెల్లి, పాతసోమిని, నాగెపల్లి, గెర్రెగూడ, బండ్లగూడ, పాతమొగవెల్లి తదితర గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోక లు స్తంభించాయి. మండలంలోని చెరు వులు జలకళ సంతరించుకున్నాయి. పంట పొలాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో, అటవీశాఖ కార్యాలయాల ఆవరణ పూర్తిగావరదనీటితో నిండి చెరువును తలపించాయి. బెజ్జూరు సమీపంలోని గొల్లబాయి చెరువువరద నీటితోమత్తడి పొంగి పోర్లుతోంది. కాగా వర్షంతో పలువురి ఇల్లు, ఇంటిగోడలు కూలిపోయాయి. చింతల మానేపల్లిలో దిందా-కేతిని గ్రామాల మధ్యలోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు పొంగిపొర్లడంతో దిందా గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. అలాగే బాబాసాగర్(నాయకపుగూడ)వాగు ఉప్పొంగడంతో బయటకు వెళ్లే పరిస్థితిలేదని ప్రజలు వాపోతున్నారు.

దహెగాంలో పురుషోత్తమరావుప్రాజెక్టు మత్తడి దూకుతూ ప్రవహిస్తోంది. పెద్దచెరువు మత్తడి పొంగిపొర్లడంతో పంటపొలాలు నీటమునిగాయి. అంతర్గత రహదారులపై వరద నీరు ప్రవ హించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.పెంచకలపేటలో కొండపల్లి-గొల్లవాడ మధ్యలో లెవల్‌వంతెనపై నుంచి భారీగా వరద నీరు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. పెద్దవాగు, ఉచ్చమల్లివాగు, బొక్కివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండపల్లి చెరువు మత్తడి తెగిపోయింది. పెంచికలపేట, లోడ్‌పల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారికోతకు గురైంది. బొక్కివాగు ప్రాజెక్టు కాలువ వరదనీరు ఉధృతికి కోతకుగురైంది. ఎర్రగుంట లోలెవల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహించి తగ్గడంతో చెత్తచెదారం ఏర్పడగా ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు. పలు గ్రామాల్లో పంటపొలాల్లో వర్షపు నీరుచేరింది. సిర్పూర్(టి)మండలంలోని గ్రామాల రోడ్లపై వరదనీరు నిలిచింది. పెద్దబండ వాగు ఉప్పొంగడంతోపాటు నాగమ్మ చెరువులోకి భారీగా నీరు చేరి నిండిపోయింది.

జిల్లా వ్యాప్తంగా 66.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్: జిల్లాలో శుక్రవారం 66.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాగజ్‌నగర్‌లో 167.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగ అత్యల్పంగా సిర్పూర్(యు)లో 3.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగితా మండలాలైన పెంచికల్‌పేటలో 154.2మిల్లీమీటర్లు, సిర్పూర్(టి)లో 105.2, కౌటాలలో 97.8, బెజ్జూర్‌లో 97.6, దహెగాంలో 89.6, చింతలమానే పల్లిలో 85.6, వాంకిడిలో 42.2, రెబ్బెనలో 32.0, తిర్యాణిలో 29.6, లింగాపూర్‌లో 27.8, జైనూరులో 23.6 ఆసిఫాబాద్‌లో 20.2, కెరమెరిలో 18.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



చింతలమానేపల్లిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న బాబాసాగర్ వాగు



కాగజ్‌నగర్‌లో నీట మునిగిన బైక్‌లు



తెగిపోయిన పెంచికలపేటలో కొండపల్లి చెరువు మత్తడి



పెంచికలపేటలో కోతకు గురైన లోడ్‌పల్లి రోడ్డు



ఎర్రగుంట లోలెవల్‌పై చెత్తను తొలగిస్తున్న ఎస్సై కొమురయ్య



కాగజ్‌నగర్‌లో బురదగూడ రిజర్వాయర్ కాల్వకు గండి పడటంతో పొలాల్లోకి వచ్చిన నీరు



బ్యాంకులో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రుణ మాఫీలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి: కలెక్టర్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 19: పంట రుణమాఫీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం జోషి, మండల వ్యవసాయాధికారి ఖాదర్‌హుస్సేన్‌తో కలిసి సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం మేనేజర్‌తో మాట్లాడుతూ పంట రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయకూడదన్నారు. వారికి ప్రస్తుతం ఉన్నఖాతాలోనే రుణంమాఫీ మొత్తాన్ని జమచేయాలని సూచించారు. రుణమాఫీపై తనవరకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండాచూడాల్సిన బాధ్యతబ్యాంకర్లపై ఉందన్నారు.

మొక్కను బతికిస్తే అవి బతుకు ఇస్తాయి

మొక్కలను బతికిస్తే అవి మనకు బతుకునిస్తాయ ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం,గిరిజనగురుకుల బాలికలకళాశాలలో నిర్వహించిన 75వవనమహోత్సవంలో అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, డీఆర్డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు మానవాళికి జీవనాధారమన్నారు. వాటిని బతికించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 53లక్షల మొక్కలు నాటే విధంగా లక్ష్యం తీసుకున్నట్లు ఈలక్ష్యంలో 35శాతం చేరుకున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని సూచించారు.



వేలంపాటలు రద్దు చేసే వరకు పోరాటాలు

మందమర్రి టౌన్, జూలై 19: కేంద్రం ప్రవేశపెట్టిన బొగ్గు బావుల వేలం విధానాన్ని వెనక్కి తీసుకునేవరకు పోరాడుతూనే ఉంటామని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చినమోడీప్రభుత్వం ఒంటెద్దుపోకడలను మానుకోవాలన్నారు. తెలంగాణాలోని4బ్లాకులను కేటాయించకుంటే సంస్థమనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈవిషయంపై అన్నికార్మికసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయని, దీనినికేంద్రం పరిగణిలోకి తీసుకోవాలన్నారు.

మహిళా కార్మికులకు సదుపాయాలు కల్పించాలి..

సింగరేణిలో పనిచేస్తున్న మహిళాఉద్యోగులకు సరైన సదుపాయాలు కల్పించాలని హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రస్తుతం 3వేలమంది మహిళా కార్మికులు 3వేల మంది, కాంట్రాక్టు మహిళా కార్మికులు 7వేలమంది పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి సరియైన సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. రెస్టుహాల్స్, టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కార్మికుల మృతికి సంతాపం

కాసిపేట, జూలై 19: ఆర్జీ3 ఏరియాలోని ఓపెన్‌కాస్టులో ప్రమాదవశాత్తు ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ కార్మికుడు విద్యాసాగర్ మృతిచెందగా శుక్రవారం కాసిపేటగనిపై వారికి అధికారులు, కార్మికులు సంతాపం తెలిపారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచికార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు సింగరేణి ఇద్దరు కార్మికులను కోల్పోయిందని ఇది చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను యాజమాన్యం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీనాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, రంజిత్, రాజేందర్, సంపత్, రవీందర్ పాల్గొన్నారు.

రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య
- సింగరేణి భవన్‌లో ట్రైపార్టీయేట్ సమావేశం



సమావేశంలో సీతారామయ్య, బలరాం, తదితరులు

శ్రీరాంపూర్, జూలై 19: సింగరేణిలో రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. 48వ కంపెనీ స్థాయి ట్రైపార్టీయేట్ రక్షణ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించగా, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, అన్నివిభాగాల అధిపతులు, ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, వైవి రావు, మడ్డి ఎల్లయ్య, వంగ వెంకటి, తదితరులు హాజరయ్యారు. సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ, రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. యెల్లో, రెడ్‌కార్డుల పేరుతో యాజమాన్యం సూపర్‌వైజర్లను ఆందోళనలకు గురిచేయవద్దన్నారు. ఆర్కే8 డిస్పెన్సరీని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని, సీఎంఆర్-2017, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్(సిఈఏఆర్)-2010 గురించి సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించాలని, అన్నిగనుల్లో ఎస్‌డిఎల్‌లకు డంపర్ సీట్లు ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినప్పుడు వైద్యం అందించడం తప్ప డబ్బులు వసూలు చేయవద్దని, సిహెచ్‌పిలలో దుమ్ము రాకుండా చూడాలన్నారు. ఈ నెల 17న ఆర్‌జి-3 ఏరియా ఓసీపీ-2లో జరిగిన ప్రమాదంపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారు లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్కే7 గనిని యధావిధిగా నడిపించాలని కోరగా, చైర్మన్ బలరాం అలాగేనని హామీ ఇచ్చారు.

సింగరేణిలో ప్రమాదాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 19: సింగరేణిలో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జీ, సేఫ్టీఆన్‌స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఎసీఎంకేఎస్-బీఎంఎస్ పదాధికారులతో కలిసి శుక్రవారం హైదరాబాదులో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్‌ను కలిశారు. రక్షణ కోసం జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలని నియమనిబంధనలు ఉన్నప్పటికి సింగరేణి సంస్థ పట్టించుకోవడం లేదన్నారు. ముందుగా పనిస్థలాలను పర్యవేక్షించి ఏరియా ఫిక్సేషన్ నిర్ణయించాలన్నారు. రక్షణ విభాగం వైఫల్యంతోనే ఓసీపీ-2లో ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ మృతిచెందారని అన్నారు. జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులకు సింగరేణి రక్షణ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 5వ, 10వ ఆన్యూవల్ సేఫ్టీ ట్రైపార్టైడ్ నిబంధనలను తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంస్థ సాధించిన లాభాల్లో 40శాతం వాటాను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘ్ బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, అప్పాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ యతిపతి సారంగపాణి, ప్రధానకార్యదర్శి పొన్నమనేని వేణుగోపాలరావు, శ్రీరంగ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో బీజేపీకే అధికారం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



రామచంద్రరావు సన్మానిస్తున్న మహిళ సంఘం సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 19: రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీకే అధికారం దక్కుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన బీజేపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినట్టు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఖచ్చితంగా గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి అంతా కృషి చేయాలన్నారు. పీఎం మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చిన నిధులను కూడా దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రజా పాలన పడకేసిందన్నారు. ఈ విషయాలన్నింటిని ప్రతికార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలపై తీర్మాణం చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యు డు కొంగ సత్యనారాయణ, కొట్నాక విజయ్, శ్రీదేవి, మాజీ ఎంపీపీలు మల్లికార్జున్, మనోహర్ గౌడ్, శంకర్, నీరెటి సత్యనారాయణ, బాలకృష్ణ, జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.